# మూసీని మూడేండ్లలో సుందరీకరిస్తాం

- అంబర్‌పేటకు మెట్రో రైలు
- 24 గంటల మంచినీళ్లు ఇస్తాం
- ఛే నంబర్ బ్రిడ్జిని కేంద్రం నిర్మించకుంటే.. మేమే నిర్మిస్తాం
- అంబర్‌పేట రోడ్ షో లో ప్రజలకు మంత్రి కేటీఆర్ హామీ

అంబర్‌పేట, నవంబర్ 27 : అధికారంలోకి వచ్చిన తర్వాత ఈసారి అంబర్‌పేటకు మెట్రో రైలు తీసుకువస్తామని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర మంత్రి కేటీఆర్ అన్నారు. అంబర్‌పేటలో మూడు ముఖ్యమైన పనులు చేస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అంబర్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ తరఫున రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబర్‌పేట అలీకేఫ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ మాట్లాడారు. అంబర్‌పేట వరకు మెట్రో రైలు తీసుకువస్తామని చెప్పారు. పక్కనే ఉన్న మూసీని మూడేండ్లలో సుందరీకరిస్తామన్నారు. అంబర్‌పేటలో నత్తనడకన సాగుతున్న కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని ఫ్లైఓవర్‌ను తామే తీసుకొని తొందరగా నిర్మాణం పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అంబర్‌పేటలో బీజేపీని ఓడగొట్టి బీఆర్ఎస్‌ను గెలిపిస్తారా? అని ప్రజలను అడిగారు. గెలిపిస్తారా? అని వారి నుంచి హామీ తీసుకున్నారు. అంబర్‌పేటకు ఈ రోజు మోదీ వచ్చారంటా.. ఏమి ముఖం పెట్టుకొని వచ్చారు. ఇక్కడ కిషన్‌రెడ్డి వచ్చి మళ్లీ ఓట్లు అడుగుతున్నారంటా.. అతను పోటీ చేయకుండా పారిపోయాడు. తెలంగాణకు ఒక్క పైసా తీసుకురాని కిషన్‌రెడ్డి ఎట్లా వచ్చి ఓట్లు అడుగుతాడని ప్రశ్నించారు. మోదీ, అమిత్‌షా, యోగి, బోగీల్లో మంత్రులు, రాహుల్ గాంధీ, సోనియాగాంధీ, ప్రియాంక గాంధీ, ఖర్గే, శివకుమార్, సిద్దరామయ్య ఇలా గుంపులు గుంపులుగా తెలంగాణకు వస్తున్నారు. కేసీఆర్ ఒక్కడే ఉన్నారు. సింహం సింగిల్‌గానే వస్తుంది.. గుంపులు గుంపులుగా ఎవరు వస్తారని ప్రజల నుంచి సమాధానం రాబట్టారు. 24 గంటల కరెంటు ఇచ్చినట్లే మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే నగరానికి 24 గంటల మంచినీళ్లు ఇస్తామని చెప్పారు. గత హయాంలో ముస్లింల గ్రేవ్‌యార్డుకు 3 ఎకరాల స్థలం ఇస్తామని హామీ ఇచ్చి, ఇచ్చామని. ఇప్పుడు మళ్లీ హామీ ఇస్తున్నాం. క్రిస్టియన్లు, హిందువులకు కూడా శ్మశాన వాటికలకు స్థలాలను కేటాయిస్తామని అన్నారు.


అంబర్‌పేట రోడ్ షో లో పాల్గొని మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్

**మసీదు నుంచి హాజా రావడంతో మధ్యలోనే స్పీచ్‌ను ఆపేసిన కేటీఆర్...**

మంత్రి కేటీఆర్ మాట్లాడుతున్న సమయంలో మసీదు నుంచి ప్రార్థన హాజా రావడంతో స్పీచ్‌ను మధ్యలోనే ఆపేశారు. ప్రార్థన ముగిసిన వెంటనే మళ్లీ మాట్లాడుతూ అన్ని మతాలను గౌరవించే సాంప్రదాయం హైదరాబాద్ వాసులదని చెప్పారు. వినాయక నిమజ్జనం రోజు మిలాద్ ఉన్ నబీ ర్యాలీ ఉండగా, దాన్ని ముస్లింలు రెండు రోజుల పాటు వాయిదా వేసుకొని మత సామరస్యాన్ని చాటారని గుర్తు చేశారు.


కేటీఆర్ రోడ్ షోకు హాజరైన జనం

## అభివృద్ధిని చూసి బీఆర్ఎస్‌కు మద్దతు


కాచి వెల్ఫేర్‌సంఘ్ సమావేశంలో పాల్గొని మాట్లాడుతున్న కాలేరు వెంకటేశ్

కాచిగూడ, నవంబర్ 27: తెలంగాణ అభివృద్ధిని చూసి రాజకీయాలకు అతీతంగా ప్రజలందరు బీఆర్ఎస్‌కు మద్దతు ఇస్తున్నారని ఎమ్మెల్యే అభ్యర్థి కాలేరు వెంకటేశ్ అన్నారు. సోమవారం కాచి వెల్ఫేర్‌సంఘ్ (కాచిగూడ)కులస్తులు బీఆర్ఎస్ అభ్యర్థి కాలేరు వెంకటేశ్‌కు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో ఎక్కడ లేని విధంగా తెలంగాణలో సంక్షేమ పథకాలు అమలు కావడంతో ప్రజలు బీఆర్ఎస్ పార్టీని విశ్వసిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతి గడపలోని ప్రజలు ఏదో ఒక తెలంగాణ సంక్షేమ పథకాన్ని అనుభవిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల పరిపాలన కొనసాగుందని, అందుకు ప్రజలు బీఆర్ఎస్‌వైపు మొగ్గు చూపుతూ, సీఎం కేసీఆర్ పరిపాలనకు జేజేలు పలుకుతున్నారని పేర్కొన్నారు. కాచి వెల్ఫేర్‌సంఘ్ అధ్యక్షుడు ప్రణయ్‌సింగ్, ప్రధాన కార్యదర్శి నట్రాజ్‌సింగ్, దౌలత్‌సింగ్, మున్నాసింగ్, మోహన్‌సింగ్, రాజేందర్‌సింగ్, కాలియాసింగ్, చందన్‌సింగ్ పాల్గొన్నారు.


